గ్రీన్‌ఎనర్జీ ప్లాంట్ పెడితే భరోసా కట్

- ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలాలకు నాలా కన్వర్షన్
- ప్లాంట్లకు ఎకరం లీజు ధర కేవలం రూ.లక్ష
- కార్పొరేట్‌కు అనుకూలంగా గ్రీన్‌ఎనర్జీ పాలసీ

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ భూముల్లో సోలార్ పవర్, ఇతర గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటే, ఆ రైతులకు రైతు భరోసా పోయినట్టే. పవన విద్యుత్తు ప్లాంట్లకు లీజుకు ఇచ్చినా అంతే సంగతి. బ్యాటరీ స్టోరేజీ, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేసినా రైతు భరోసా కోల్పోయినట్టే. ఈ ప్లాంట్లను ఏర్పాటుచేసిన స్థలాలు ఆటోమాటిక్‌గా నాలా కన్వర్షన్ అవుతాయి. వ్యవసాయ స్థలాలు వ్యవసాయేతర భూములైపోతాయి. ఏకంగా 25 ఏండ్లపాటు రైతులు స్థలాన్ని, ప్రయోజనాలను కోల్పోతారు. రైతు భరోసా రాదు. రుణాలు కూడా తీసుకోలేరు. ప్లాంట్ కోసం 25 ఏండ్లు లీజుకు ఇవ్వాలి. ఎకరానికి ఏడాదికి లక్ష రూపాయలు లీజుగా ఖరారుచేశారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. అవి ప్రైవేట్, కార్పొరేట్ వర్గాలకు అనుకూలమని విమర్శలు వినిపిస్తున్నాయి. అదానీ లాంటి కంపెనీలకు రెడ్‌కార్పెట్ పర్చేందుకే ఈ పాలసీని రూపొందించారన్న వాదనలున్నాయి.

కార్పొరేట్ అనుకూల నిబంధనలు

- ఎకరానికి రూ.లక్ష చొప్పున 25 ఏండ్ల పాటు లీజుకిస్తారు. ప్రాజెక్ట్ కమిషన్ ఆఫ్ డేట్ నుంచి 25 ఏండ్లపాటు లీజు అమలులో ఉంటుంది. ఈ ప్లాంట్లకు కేటాయించిన వ్యవసాయ స్థలాలు నాన్ అగ్రికల్చర్ కిందికి మారిపోతాయి.
- పవన విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వ భూములను మార్కెట్ విలువలో 10% ధరకు ఏడాదిపాటు లీజుకిస్తారు. ప్రతి రెండేండ్లకు 5% చొప్పున లీజు ధర పెంచుకునే అవకాశం ఉంటుంది.
- రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. విద్యుత్తు సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో కపోతే రిజర్వాయర్ స్థలాన్ని థర్డ్ పార్టీ, ప్రైవేట్ సంస్థలకు కేటాయిస్తారు.
- విండ్, పంప్డ్ ప్లాంట్ల భూసేకరణకు ల్యాండ్ సీలింగ్ పరిమితి వర్తించదు. సోలార్ ప్లాంట్ విషయంలో మెగావాట్ ప్లాంట్‌కు 4 ఎకరాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు.
- విద్యుత్తు సంస్థలకు చెందిన సబ్‌స్టేషన్ల స్థలాలను బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు కేటాయిస్తారు. ఆ స్థలాలను ప్రైవేట్ డెవలపర్లకు ఇచ్చినట్టే.
- పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లకు ప్రభుత్వ స్థలాలను 45 ఏండ్లపాటు లీజుకిస్తారు. మొదట రెండేండ్లకు మార్కెట్ ధరలో 10శాతానికే ఈ స్థలాలను లీజుకు కేటాయిస్తారు. ఆ తర్వాత ఏటా 5% చొప్పున లీజు మొత్తాన్ని పెంచుతారు.
- ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేయదలిస్తే భూసేకరణ వారే చేసుకోవాల్సి ఉంటుంది. అటవీశాఖ భూములు తీసుకుంటే ఆ శాఖ నిబంధనలు అమలవుతాయి.

ఏనుగల్లులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

పంట రుణాలు పూర్తిగా మాఫీ చేయాలి

ఏనుగల్లులో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

పర్వతగిరి, జనవరి 12 : రూ.2 లక్షల పంట రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని కోరుతూ ఆదివారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్లులో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని నినదించారు. ఏనుగల్లులోని గ్రామీణ వికాస్ బ్యాంకులో 1100 మందికి రుణాలుండగా, 700 మంది రైతులకే మాఫీ జరిగిందని చెప్పారు. పీఏసీఎస్‌లో 1400 రైతులకుగాను కేవలం 800 మందికే రుణాలు మాఫీ అయ్యాయని వివరించారు. రైతుభరోసాలో ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

సిరిసిల్లలోని 32వ వార్డులో '4వేలు పింఛన్ ఎప్పుడిస్తవ్ రేవంత్‌రెడ్డి' అంటూ ముగ్గు వేసి నిరసన తెలుపుతున్న వృద్ధులు, స్థానికులు

4 వేల పింఛన్ ఎప్పుడిస్తవ్ రేవంత్?

- సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళల వినూత్న నిరసన
- సిరిసిల్లలో సర్కార్‌పై వ్యతిరేకత

సిరిసిల్ల టౌన్, జనవరి 12: హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై మహిళల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. హామీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం సిరిసిల్లలోని పలు వార్డుల్లో కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, 32వ వార్డులో పలువురు మహిళలు వినూత్న నిరసన తెలిపారు. 'రూ.4వేలు పింఛన్ ఎప్పుడు ఇస్తావు రేవంత్‌రెడ్డి' అంటూ ఓ మహిళ ముగ్గు ద్వారా తన ఆవేదనను వ్యక్తం చేసింది. 'తులం బంగారం కట్' అంటూ మరో మహిళ ముగ్గు వేసింది.

భరోసా మోసంపై చర్చకు సిద్ధమా?

- రాహుల్, రేవంత్ ఎవరైనా హామీలు నెరవేర్చారా?
- కాంగ్రెస్ నాయకులు ఊర్లోకి వస్తే రైతులు నిలదీయాలి
- సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలపై హరీశ్‌రావు ఆగ్రహం

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ తదితరులు

సిద్దిపేట, జనవరి 12: కాంగ్రెస్ పాలకులు రైతులను నట్టేట ముంచి, నిస్సిగ్గుగా సంబురాలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. రైతులు కాంగ్రెస్ నేతలు గ్రామాలకు వస్తే నిలదీస్తారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరకు ఎవరైనా ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు అందరినీ మోసం చేశారని, ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుభరోసా హామీ మేరకు రూ.15 వేలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసగించిందని, వానకాలం రైతుభరోసాకు గుండుసున్నా పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకులు ఊర్లలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే అని రైతులు నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో 3 పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక్క పంటకు కూడా సరిగా ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు రైతుభరోసా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు నోరు పెంచి ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు ఏటా రూ.12 వేలు మాత్రమే ఇస్తామనడం సిగ్గుచేటని నిప్పులుచెరిగారు. కోటి మంది ఉపాధి హామీ కూలీలు ఉంటే కేవలం పది లక్షల మంది రైతు కూలీలకు మాత్రమే రూ.12 వేల చొప్పున ఇస్తామని అంటున్నారని తెలిపారు. 90 లక్షల మందికి పథకాన్ని ఎగ్గొట్టారని విమర్శించారు. వ్యవసాయ కూలీలందరికీ పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పథకంలో ప్రతిపాదనలు చేసేటప్పుడు పాలకులకు కనీస సోయి లేకుండా పోయిందని నిప్పులుచెరిగారు. మెడ మీద తలకాయ ఉన్నోళ్లు ఇలా చేస్తారా అని ప్రశ్నించారు.

ఒట్లు పెట్టి.. పథకాలు ఎగ్గొట్టి!

కనపడ్డ దేవుళ్లందరి మీద ఒట్టు పెట్టి రైతు రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఏడాది గడిచినా ఇంతవరకు పూర్తిగా చేయలేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి బుకాయించకుండా ఇచ్చిన మాట ప్రకారం రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన వారిని గూండాలతో కొట్టించుడో, చిల్లరగాళ్లతో తిట్టించుడో మానుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని కొందరు రైతులు వివరాలను ఆధారాలతో సహా హరీశ్‌రావు మీడియాకు చూపించారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలు కూడా తప్పుతున్నారని, పది పంటలకు బీమా అని చెప్పి ఒక్క పంటకే ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన ప్రధానమైన 5 హామీలు రైతుభరోసా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, పంటలబీమా, అన్ని పంటలకు బోనస్, కౌలు రైతులకు రైతుభరోసా అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కొట్లాడుదామని అంజయ్యకు చెప్పిన

నారాయణఖేడ్‌కు చెందిన రైతు బీముని అంజయ్య రుణమాఫీ కానందుకు బాధపడుతూ తనకు ఫోన్ చేశాడని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడు రూ.లక్ష రుణమాఫీ అయిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ కాలేదని చెప్పినట్టు వెల్లడించారు. తనకు చావే శరణ్యం అంటూ అంజయ్య ఆవేదన వ్యక్తంచేయగా ఆత్మహత్య వద్దని, ప్రభుత్వం రుణమాఫీ సంపూర్ణంగా చేసేవరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చానని హరీశ్‌రావు తెలిపారు.

రుణమాఫీ కాని రైతుల జాబితా

రైతు	గ్రామం	రుణం
మంగళ నర్సింహారెడ్డి	కంది	రూ.1,42,500
జంగం రాజశేఖర్	జహీరాబాద్	రూ.1,07,251
అంకిల్ల కనకరెడ్డి	సిర్పనగండ్ల	రూ.1,17,703
నల్లా బుచ్చిరెడ్డి	నారాయణరావుపేట	రూ.1,11,749
ముచ్చర్ల రాజారాం	కొండపాక	రూ.67,439

యూరియా కోసం రైతుల బారులు

యాసంగి సీజన్‌లో తప్పని తిప్పలు

పెద్దవంగర కో-ఆపరేటివ్ రైతుబజార్ ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

పెద్దవంగర, జనవరి 12 : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని కో-ఆపరేటివ్ రైతుబజార్ ఎదుట ఆదివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. యాసంగి సీజన్‌లో మక్కజొన్న, వరి, మిర్చి పంటలు సాగు చేశారు. యూరియా సొసైటీలకు మాత్రమే రావడంతో రైతులు బారులు తీరారు. ప్రైవేట్ షాపుల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇతర మండలాల వైపు పరుగులు తీయాల్సివస్తోంది. అధికారులు స్పందించి రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని కోరారు.

ఉన్నది 125 మెట్రిక్ టన్నులే..

మండలంలో వివిధ పంటల సాగుకు 2200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 125 మెట్రిక్ టన్నులేనని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యూరియా కొరతపై వారిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా పైవిధంగా సమాధానమిచ్చారు. సొసైటీ కోరిన ప్రకారం విడుతల వారీగా యూరియా వస్తున్నదని వెల్లడించారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 12: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు క్యూలో వేచిఉన్నారు. వరి పొలాలకు యూరియా వేసే తరుణం కావడంతో సహకార సంఘానికి యూరియా వచ్చిందని తెలియగానే రైతులు ఎగబడుతున్నారు. ఎరువు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కౌలు రైతుకేది భరోసా?

మొదటిపేజీ తరువాయి...

హోదాలో కౌలురైతులకు రేవంత్‌రెడ్డి రాసిన బహిరంగ లేఖ. తీరా అధికారంలోకి వచ్చాక కౌలురైతులకు ధోకా ఇచ్చారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామన్న ఎన్నికల హామీని తుంగలో తొక్కారు. ఎన్నికలకు ముందు కౌలురైతులకు లేఖలు రాసిన ఆయన.. నేడు ఎగనామం పెట్టారు. కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీనే దిక్కన్నట్టుగా అసెంబ్లీ ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించారు. బహిరంగ లేఖలు రాయడమే కాదు... కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ, ఆరు గ్యారెంటీల్లోనూ కౌలురైతులకు రైతు భరోసా ఇస్తామంటూ హామీ ఇచ్చారు. ప్రతి ఎన్నికల సభలోనూ ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కూడా ఇదే హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి పలు టీవీ చర్చల్లోనూ ఎలాంటి తడబాటు లేకుండా కచ్చితంగా కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పారు. 'కౌలురైతులకు రైతు భరోసా ఇవ్వడం సాధ్యమేనా? ఏ విధానంలో కౌలు రైతులకు రైతుభరోసా ఇద్దామనుకుంటున్నారు? వారిని ఏ విధంగా గుర్తిస్తారు?' వంటి పలు ప్రశ్నలు రేవంత్‌రెడ్డికి ఎదురయ్యాయి. ఈ ప్రశ్నలకు కూడా అందరినీ నమ్మించేలా ఆయన సమాధానం చెప్పడం గమనార్హం. 2011లో కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన కౌలుదారు చట్టాన్ని అమలుచేస్తామని, గ్రామసభల ద్వారా కౌలురైతులను గుర్తించి రాష్ట్రంలోని ప్రతి కౌలురైతుకు రైతుభరోసా అందిస్తామని నమ్మబలికారు. కానీ, ఇప్పుడు వాటన్నింటిని పక్కనపెట్టేసి కౌలురైతులను నిండా ముంచారు.

రైతు భరోసాలో కౌలురైతులపై చర్చే లేదు

దాదాపు ఆర్నెళ్లుగా రైతు భరోసా విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఏ సందర్భంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి గానీ, మంత్రులు గానీ కౌలురైతుల గురించి ఒక్క మాట మాట్లాడిన పాపానపోలేదు. రైతు భరోసాపై కసరత్తులో వీరి ప్రస్తావనే రాలేదు. కౌలు రైతులకు రైతు భరోసా ఇచ్చే మార్గాలేమైనా ఉన్నాయా? అనే అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. ఈ విధంగా రైతు భరోసా పథకంలో కౌలురైతులను అసలు పరిగణనలోకి తీసుకోకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎత్తిచూపుతున్నది.

23 లక్షల మంది ఆశలు ఆవిరి

కౌలురైతులకు రైతుబంధు ఇవ్వడం సాధ్యం కాదని, అలా చేస్తే రైతులకు, కౌలు రైతులకు కొట్లాటలు పెరిగిపోతాయని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్తూ వచ్చారు. కానీ, అధికారమే పరమావధిగా అమలకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి కౌలురైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని హామీ ఇవ్వడంతో వారంతా నిజమేనని నమ్మారు. అందుకే కాంగ్రెస్‌కు అండగా నిలిచి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దోహదం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమకు కూడా రైతు భరోసా వస్తుందని కౌలురైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ, వారి ఆశలు ఆవిరయ్యాయి. రైతు భరోసాపై కౌలురైతులకు కాంగ్రెస్ మొండిచెయ్యి చూపింది. రాష్ట్రంలో సుమారు 23-25 లక్షల మంది కౌలురైతులు ఉంటారని అంచనా. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికలకు ముందు కౌలురైతులకు రాసిన లేఖలో రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య 22 లక్షలని, వీరు సాగు చేసే భూమి 40% ఉంటుందని పేర్కొన్నారు. ఈ లెక్కన కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 23 లక్షల మంది కౌలురైతులకు ధోకా ఇచ్చినట్టయ్యింది.

భూభారతిలోని సాగు భూములకే రైతు భరోసా

- ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 12(నమస్తే తెలంగాణ): భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదై, వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. రైతు భరోసా పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ నెల 10న జీవో ఆర్టీ నంబర్ 18 జారీ చేశారు. అయితే, ప్రభుత్వం వెంటనే ఈ ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో పెట్టకపోవడం గమనార్హం. రెండు రోజుల తర్వాత ఆదివారం వీటిని బహిర్గతం చేసింది. రైతు భరోసా పథకం అమలు బాధ్యతను వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు అప్పగించింది. జిల్లాల్లో మాత్రం పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కార బాధ్యతను కలెక్టర్లకు అప్పగించింది.

మార్గదర్శకాల్లోని ముఖ్యాంశాలు

రైతు భరోసా పథకం కింద పంటల పెట్టుబడి సాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ.12 వేలకు పెంచినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నది. వాస్తవానికి, ఎకరాకు 15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆరు గ్యారెంటీల్లోనూ పేర్కొన్నది.

- భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదై, వ్యవసాయ యోగ్యమైన భూమి పట్టాదారులకు మాత్రమే రైతు భరోసా సహాయం అందజేస్తారు.
- వ్యవసాయ యోగ్యంకాని భూములు రైతు భరోసా నుంచి తొలగింపు.
- ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతు భరోసాకు అర్హులు.
- గతంలో మాదిరిగానే డీబీటీ పద్ధతిలో రైతుల ఖాతాల్లో జమ.

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. అప్పుల భారం మోయలేక
- వరంగల్ జిల్లాలో వెంకన్న బలవన్మరణం

వెంకన్న (ఫైల్)

పర్వతగిరి, జనవరి 12: అప్పులబాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారు సోమ్లా తండాలో జరిగింది. ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ్లాతండాకు చెందిన భూక్యా వెంకన్న (24)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఇందులో ఎనిమిది ఎకరాల్లో పత్తి, నాలుగు ఎకరాల్లో వరి వేశాడు. పత్తి పంటలో దిగుబడులు ఆశించినంత రాలేదు. దీంతో సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. మరోవైపు రైతుభరోసా పథకంలో పంట సాయం అందలేదు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక వెంకన్న ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం రైతు వెంకన్న కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

మన్నెంపల్లి కెనాల్‌కు మళ్లీ గండి

- జలదిగ్బంధంలో ఎస్సీ కాలనీ
- ఇండ్లలోకి నీరు..తడిసిన సామగ్రి
- పండుగ పూట కన్నీటి వ్యథ
- గతంలో నాలుగుసార్లు తెగినా తూతూమంత్రంగా మరమ్మతులు
- మన్నెంపల్లి వాసుల మండిపాటు

తిమ్మాపూర్, జనవరి 12: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి డీ4 కెనాల్‌కు మళ్లీ గండిపడింది. ఆదివారం తెల్లవారుజామున తెగిపోవడంతో గ్రామంలోని దళిత కాలనీ జల దిగ్బంధంలో చిక్కుకున్నది. గతంలోనే నాలుగుసార్లు గండిపడినా అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారు. సమస్య పునరావృతం కావడంపై ప్రజలు మండిపడుతున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాలువ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పీచుపల్లి మీదుగా సైదాపూర్ వెళ్తుంది. పీచుపల్లి వద్ద డీ4 కాలువ విడిపోయి తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీటిని అందిస్తున్నది. మన్నెంపల్లి మీదుగా చెంజర్ల తదితర గ్రామాల మీదుగా వెళ్లే ఈ కెనాల్, గ్రామంలోని దళిత కాలనీ పైన కాలువ కట్ట పరిమాణం తక్కువ మోతాదులో ఉండటం, ఎత్తుగా ఉండటంతో నీళ్లు మళ్లపడుతున్నాయి. దీనికితోడు కాలువలో చెత్తాచెదారం తొలగించకపోవడంతో నీరు వెళ్లలేక తరచూ గండిపడుతున్నది. ఇప్పటికే నాలుగుసార్లు తెగిపోగా, ఆదివారం తెల్లవారుజామున మరోసారి గండిపడటంతో మన్నెంపల్లి ఎస్సీ కాలనీ జలమయమైంది. వీధులన్నీ నీటితో నిండిపోయాయి. కాలువ గండి పడిన సమీపంలో గుట్ట ఉండగా, దాని వరద నీళ్లు బయటకు వెళ్లేందుకు కెనాల్ కింద నుంచి డీబీ ఏర్పాటు చేశారు. గండి నుంచి బయటికి వస్తున్న నీరు ఆ డీబీ గుండా గ్రామంలోకి చేరుతున్నట్టు స్థానికులు చెప్తున్నారు. మన్నెంపల్లి వాసులకు సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కలెక్టర్ పమేలా సత్పతిని ఆదేశించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. తరుచూ కాల్వకు గండి పడుతుందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరగా.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

స్థాయికి మించి నీళ్లు రావడంతో..

తోటపల్లి రిజర్వాయర్ నుంచి మెయిన్ కెనాల్ ద్వారా తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లోని పలు గ్రామాలకు నీళ్లు వెళ్తాయి. ఈ క్రమంలో ప్రధాన కాలువ నుంచి చిగురుమామిడి మండలం పీచుపల్లి వద్ద డీ4 ఉప కాలువ ద్వారా తిమ్మాపూర్, మానకొండూర్ మండలాలకు వెళ్తాయి. మన్నెంపల్లి వరకు నీళ్లు సక్రమంగా వస్తున్నా, దిగువకు వెళ్లేందుకు నీళ్లు ఎక్కడం లేదు. దీంతో దిగువన ఉన్న రైతులు తమకు నీళ్లు ఎక్కువగా రావాలని 200 క్యూసెక్కుల కెపాసిటీ గల కాలువకు ప్రధాన కాలువ గుండా వెళ్లే నీరంతా ఇటు మళ్లించడంతో కెపాసిటీ సరిపోక గండి పడుతున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. గండికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి దిగువన ఉన్న రైతులకు నీటిని అందిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ పెద్ది రమేశ్ తెలిపారు.

కరీంనగర్ జిల్లా మన్నెంపల్లి డీ4 కెనాల్‌కు గండిపడడంతో గ్రామంలోని దళిత కాలనీలోకి భారీగా చేరుకున్న నీరు, జలమయమైన రోడ్లు

తిండి లేదు.. ఏం లేదు

నీళ్లన్నీ ఇండ్లల్లోకి చేరడంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు తడిసిపోగా, బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. పండుగ పూట సంతోషంగా గడపాల్సిన గ్రామస్థులు తిండిలేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. నాలుగోసారి తెగడం, అధికారులు ఎప్పటిలాగే సరిచేస్తం అని చెప్పడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు.

పొంగులేటి బాధ్యత వహించాలి: రసమయి

కాలువ గండి పడటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. పండుగ పూట సంతోషంగా ఉండాల్సిన కుటుంబాలు పస్తులుండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి సొంత కంపెనీ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ద్వారానే కాలువ నిర్మాణం జరిగిందని గుర్తుచేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎమ్మెల్యే కవ్వంపల్లి చుట్టపు చూపుగా రావడం భావ్యంకాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మాట్లాడే పొంగులేటికి, తన సొంత సంస్థ చేసిన నిర్మాణానికి బాధ్యత ఉండదా? అని ప్రశ్నించారు.

భయం భయంగా గడుపుతున్నం

ఇప్పటికి నాలుగు సార్ల మా దగ్గర్నే తెగింది. తెగినప్పుడల్లా రెండు రోజులు ఇళ్లంతా నీళ్లే ఉంటన్నయి. తెగినప్పుడు కూడా జాలు పడ్డది. కాలువకు నీళ్లత్తన్నయంటే భయం భయంగా గడుపుడైతంది. ఇంట్ల సమాన్లన్నీ తడిసిపోయినయ్. పండుగకు తెచ్చుకున్న సమాన్లు కరాబైనయ్. తెగినప్పుడు సార్లు అత్తరు, అట్లీట్ల అంటరు పోతరు. మల్ల కనిపియ్యరు. పగటీలైంది ఇవ్వారకు అన్నం తిండ్లే. పోరగండ్లను పట్టుకుని గడుపుతన్నం.

-పార్నంది సుమలత, మన్నెంపల్లి

నీళ్లు వచ్చి ముంచినయి

ఆదివారం తెల్లవారే సరికి వరద వచ్చి ఇంటిని ముంచేసింది. ఎన్ని సార్లు జరిగినా అప్పటిమందం సమస్య పరిష్కరించి వదిలేస్తున్నరు. పొద్దు పొద్దున్నే నీళ్లు రావడంతో ఇంట్ల సామాన్లన్నీ తడిచిపోయినయ్. తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం స్పందించి మాకు మరోసారి సమస్య రాకుండా చూడాలి.

- సుదగోని సదయ్యగౌడ్, మన్నెంపల్లి

పండుగ పూట ఇబ్బంది పడుతున్నం

కాలువకు గండి పడడంతో ప్రజలు పండుగ పూట ఇబ్బంది పడుతున్నరు. సామాన్లు కూడా తడిసిపోయినయ్. అధికారులకు ఎన్నిసార్లు వివరించినా తాత్కాలికంగా పరిష